క్లుప్తంగా

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

వెలుగోడు: వలంటీర్ల వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై శుక్రవారం మండలంలోని వలంటీర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. తమకు పవన్ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో షేక్ అమానుల్లాకు వినతిపత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపం రెడ్డి మాట్లాడుతూ.. సైనికుల్లా పనిచేస్తున్న వలంటీర్లను కించపరచడం సరికాదన్నారు. వలంటీర్ల వ్యవస్థపై కొందరు వ్యక్తులు పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు సురేష్, బాలు, సచిన్ నాయక్, వెంకటేశ్, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

సరైన ధ్రువపత్రాలతో హాజరు కావాలి

కొత్తపల్లి: జాతీయ రహదారి 167 కే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు వారి సరైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వీరాపురం రహదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఫంక్షన్ హాల్‌లో పరిశీలన ఉంటుందని తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం మండలంలో సిద్దేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, గోకవరం, దుద్యాల గ్రామాలలో 291.30 ఎకరాలు సేకరించామన్నారు. ఇందులో 55.54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ గ్రామాలలో భూములు, కట్టడములు కోల్పోతున్న వాటికి సంబంధించిన 13 సంవత్సరాల ఈసీ, అడంగలు, ఆర్ఓఆర్(1బీ) మీ సేవ ద్వారా ఒరిజినల్, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్, దస్తావేజులు, కట్టడములకు సంబంధించిన జిరాక్స్‌లతో రావాలని వివరించారు.

ఆర్చ్ స్థల సేకరణకు సర్వే

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామంలో కొలనుభారతి దేవి ఆలయానికి వెళ్లే రహదారిలో ఆర్చ్ నిర్మాణం కోసం స్థలానికి గురువారం మండల సర్వేయర్ అనుష, పంచాయతీ కార్యదర్శి ఆజ్మతులు సర్పంచు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో భూ సర్వే నిర్వహించారు. త్వరలోనే మ్యాప్ ఇస్తామన్నారు.

ఉపాధి హామీ పథకం కూలీలకు వరం

పగిడ్యాల: వలసలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ హామీ పథకం కూలీలకు వరమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామ పంచాయతీకి మజరా గ్రామమైన పడమర వనములపాడు గ్రామంలో కూలీలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పకీర్ సాహెబ్, భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ, జయరాముడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ వద్ద పుట్టీలు మాయం



రిజర్వాయర్ పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

వెలుగోడు:బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద శుక్రవారం మూడు పుట్టీలు మాయమయ్యాయి. గండిపేట శ్రీనివాసులు, జంగాల రాము, తిమ్మయ్య చేపల వేట కోసం రిజర్వాయర్ వద్ద పుట్టీలు ఏర్పాటు చేసుకోగా గుర్తు తెలియని వ్యక్తులు వాటిని అపహరించినట్లు బాధితులు వెలుగోడు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ షాషావలి, సిబ్బంది రిజర్వాయర్ పరిసరాల్లో పరిశీలించి కేసు నమోదు చేశారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

నందికొట్కూరు: సెమిస్టర్-2కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తునట్లు ఎంఈఓ షేక్ ఫైజున్నీసాబేగం అన్నారు. గురువారం పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా పాఠశాలలకు తరలించారు. ఆమె మాట్లాడుతూ సెమిస్టర్-2కు సంబంధించిన 15 వేల పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

వంద శాతం లబ్ధిచేకూర్చడమే లక్ష్యం

- అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- అట్టహాసంగా జగనన్న సురక్ష కార్యక్రమం



గాజులపల్లెలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి



వెలుగోడులో ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు



వెంకటాపురం సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో అర్హత ఉన్న లబ్ధిదారులకు వంద శాతం ప్రభుత్వ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని పీర్లచావిడి, మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, అప్పట్లో రైతుల రుణమాఫీ, పొదుపు మహిళల రుణమాఫీ, నిరుద్యోగ భృతి లాంటి పథకాలను అందించడంలో ఆ పార్టీ విఫలమైన విషయం ప్రజలందరికి గుర్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఏర్పాటు చేసి, గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యానికి శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్లను కించపరిచే విధంగా సినీనటుడు పవన్‌కల్యాణ్, టీడీపీ నేత చంద్రబాబు మాట్లాడడం సరికాదన్నారు. సినీ నటుడు పవన్‌కల్యాణ్ వలంటీర్లపై పోటీ చేసి గెలిచే సత్తా ఉందా... అని ప్రశ్నించారు.

వెంకటాపురంలో సచివాలయం ప్రారంభం

మండలంలోని వెంకటాపురం గ్రామంలో నూతన సచివాలయాన్ని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి గురువారం ప్రారంభించారు. రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన సచివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, వెంకటాపురం సర్పంచ్ గంగాదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి, శివనాగిరెడ్డి, అల్లిబాష, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

వెలుగోడు: కులాలు, పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శుక్రవారం వెలుగోడు పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్నసురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. సచివాలయం-2 పరిధిలో 352 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇటీవల ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన శిల్పా చక్రపాణిరెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయనను గజమాలతో సత్కరించి, దుశ్శాలువాలతో సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జెడ్పీటీసీ అమిరున్ బీ, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాలు ప్రశంసిస్తుంటే మీకేం పైత్యం?

మహానంది: దేశంలోని అన్ని రాష్ట్రాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఏపీ సచివాలయ పాలనను ప్రశంసిస్తుంటే ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాత్రం పైత్యం వచ్చిన వారిలా వ్యాఖ్యలు చేయడం ఏంటని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజులపల్లె-2 సచివాలయం పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి హాజరైన ఎమ్మెల్యే శిల్పాకు గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు(గాజులపల్లె కిట్టు) స్వాగతం పలికారు. కార్యక్రమం నిర్వహణ తీరు, అర్హత పత్రాల నమోదులో జాప్యం, తప్పులపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతిపై అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల వలంటీర్లకు వందనం కార్యక్రమానికి గైర్హాజరైన వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల నిర్లక్ష్యంపై నాయకులు జోక్యం చేసుకోవద్దన్నారు. అనంతరం 694 మందికి 689 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు, సీనియర్ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వర రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సర్పంచ్ గడ్డం చంటి, ఎంపీటీసీ నరసింహుడు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైలం శిఖరేశ్వరం వద్ద ఎమ్మెల్యేకు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మైనార్టీ కార్యదర్శి ఎమ్ఏ రజాక్, మండల ఇన్‌చార్జ్ భరత్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

నేడు 'జగనన్న సురక్ష'

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని గ్రామసచివాలయం -3లో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు వెస్ట్రన్‌కాలనీలోని గ్రామసచివాలయంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లను పంపిణీ చేస్తారు. అనంతరం సున్నిపెంటలో శ్రీశైలందేవస్థానం నిర్మిస్తున్న స్టాఫ్‌క్వార్టర్స్‌ను పరిశీలిస్తారు.

ఇండోర్ స్టేడియం స్థలంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



717 సర్వే నంబర్‌లోని స్థలాన్ని పరిశీలిస్తున్న మండల సర్వేయర్ సహనా పర్వీన్

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం కోసం కేటాయించిన స్థలం ఎక్కడుందనే విషయంపై తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ గురువారం విచారణకు ఆదేశించారు. స్థలం విషయంపై ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో 'ఇండోర్ స్టేడియం స్థలం ఏమైనట్లు?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 717 సర్వేనెంబర్ ఎక్కడుంది, అందులో ఎంత స్థలం ఉంది. ఇండోర్‌స్టేడియం నిర్మాణం కోసం ఎంత స్థలం కేటాయించారు అ' మండల సర్వేయర్ సహనాపర్వీన్‌తో సర్వే చేయించారు. స్థానిక గురుకుల పాఠశాలకు సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 717లోని స్థలాన్ని పరిశీలించి మ్యాప్ సహాయంతో విచారణ చేపట్టారు. స్థలాన్ని సమగ్రంగా సర్వేచేసి ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని వెలికితీస్తామని ఆమె తెలిపారు. అయితే సర్వేనెంబర్ 717కు సంబంధించిన రికార్డులు, అందులో ఇండోర్ స్టేడియానికి స్థలం కేటాయించినట్లు ఉన్న రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో కనిపించడం లేదని అధికారులు పేర్కొనటం కొసమెరుపు. సర్వేలో సచివాలయ సర్వేయర్లు వసీమ్‌అఖ్తర్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలి



రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో దాసు

నందికొట్కూరు రూరల్ : నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో ఎలాంటి లోపాలు, పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలని ఆత్మకూరు ఆర్డీఓ దాసు అధికారులకు సూచించారు. గురువారం మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో)లతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, వలస వెళ్లిన వారిని గుర్తించి ఓటర్ల జాబితాలో పేర్లను తొలగిస్తామన్నారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులను కోరారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా స్వచ్ఛీకరణకు ఇంటింటిసర్వే

పాములపాడు: ఓటరు జాబితా స్వచ్ఛీకరణకు బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. గురువారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో బూతు స్థాయి అధికారత్‌తో సమావేశం నిర్వహించారు.తప్పులు సరి చేసే క్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదన్నారు.

మొహర్రం నిర్వహణపై విచారణ



80బన్నూరులో గ్రామస్తులను విచారిస్తున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్,ఎస్ఐ వెంకటసుబ్బయ్య

జూపాడుబంగ్లా: జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని 80బన్నూరు గ్రామంలో మొహర్రం వేడుకల నిర్వహణపై టౌన్ సీఐ విజయభాస్కర్, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం విచారణ చేపట్టారు. 45ఏళ్ల తర్వాత 80బన్నూరు గ్రామంలో (గోకారమయ్య) మొహర్రం వేడుకలు జరుపుకోవాలని గ్రామస్తులంతా ఏకమై నిర్ణయించుకున్నారు. వేడుకలను నిర్వహిస్తే గ్రామంలో గొడవలు జరుగుతాయనే ఉద్దేశంతో ఉత్సవాలు వద్దని ఓ వర్గానికి చెందిన వారు రెండు రోజుల క్రితం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఎస్పీ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున గ్రామంలో గతంలో మొహర్రం వేడుకలు నిర్వహించే స్థలాన్ని (ప్రస్తుతం పాతసచివాలయం) పరిశీలించారు. అక్కడే గ్రామపెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించి వేడుకల నిర్వహణపై విచారించారు. అనంతరం ఇరువర్గాల వారిని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. వారితో లిఖిత పూర్వక అభిప్రాయాలను సేకరించారు. విచారణలో వెల్లడైన విషయాలను జిల్లా ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తిరుపతిలో ఉన్నా.. ఠంచన్‌గా పింఛన్



తిరుపతి ఆస్పత్రిలో ఉన్న కృష్ణవేణమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ ముకుందారెడ్డి

మహానంది మండలం తమ్మడపల్లె గ్రామానికి చెందిన నల్లారెడ్డి కృష్ణవేణమ్మ కీళ్ల సమస్యతో తిరుపతిలోని బర్డ్స్ ఆస్పత్రిలో చేరింది. అయితే మార్చి నెల ఒకటోతేదీ నాటికి ఆమె ఆస్పత్రిలో ఉంది. ప్రతి నెలా వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న కృష్ణవేణమ్మ ఒకటో తేదీ రాగానే వలంటీర్ ముకుందారెడ్డి ఆమె ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటి వద్ద లేకపోవడంతో ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నాడు. నేరుగా తిరుపతికి వెళ్లి బర్డ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణవేణమ్మను కలిసి పింఛన్ అందించాడు. – మహానంది

మందులకు ఉపయోగపడ్డాయి



కీళ్ల, మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ తిరుపతి బర్డ్స్ ఆస్పత్రిలో చేరాను. ఇంటి దగ్గర ఉంటే ప్రతి నెలా ఒకటోతేదీ నా మనవడు ముకుందారెడ్డి వచ్చి పింఛను అందించేవాడు. అయితే ఆస్పత్రిలో ఉన్న నాకు పింఛను కోసం ఫోను చేశాడు. మనవడా నేనే వచ్చి తీసుకుంటాను అన్నా సరే లేదు అవ్వా... నేనే వస్తున్నా అంటూ తిరుపతి వచ్చి ఇచ్చాడు. పింఛన్ డబ్బులు మందులకు ఎంతో ఉపయోగపడ్డాయి. – కృష్ణవేణమ్మ

చెంచులకు అదనపు పనిదినాలు కల్పించాలి



స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్‌ను కలిసిన ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: ఉపాధి హామీ పథకంలో ఆదిమ జాతి చెంచుగిరిజనులకు అదనపు పనిదినాలు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బీ రవీంద్రారెడ్డి గురువారం అమరావతిలో ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, కమిషనర్ ఎ.సూర్యకుమారి లను కలిసి ప్రతిపాదనను అందిచారు. 50 అదనపు పనిదినాలు చెంచుగిరిజనులకు ఇవ్వాలని, 30 శాతం ప్రత్యేక అలవెన్స్‌లను పునరుద్ధరించాలని కోరారు.

వర్షం..రైతన్నల హర్షం

జూపాడుబంగ్లా: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాల వల్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగుచేసిన పంటలకు ఈ వర్షం ఊపిరిపోసినట్లుగా ఉందని పేర్కొంటున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షం మండలంలోని వివిధ గ్రామాల్లో 6.8మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 8.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పగిడ్యాల మండలంలో 2.6మిల్లీమీటర్లు నమోదైనట్లు తెలిపారు. పాములపాడులో 5.8ఎం.ఎం, నందికొట్కూరులో 5.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ఆత్మకూరు: మొక్కజొన్న పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్ట్ రామకృష్ణ , ఏడీఏ ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కరివేన, నల్లకాల్వ, ఆత్మకూరు పట్టణంలోని రైతులు సాగు చేసిన పొలాల్లో గురువారం మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా మొక్కజొన్న పంటలో లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు.

పరిపాలన మరింత చేరువయ్యేలా 'జగనన్న సురక్ష'



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్



80బన్నూరులో వలంటీర్ల చేతులమీదుగా ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



నాగటూరులో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి



కొక్కెరంచలో సరిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రత్యేక అధికారి రఘురాం

నందికొట్కూరు: ప్రజల గౌరవాన్ని పెంచడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యని, వారికి పాలన మరింత చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మారుతీనగర్‌లో 11 వార్డు 7వ సచివాలయానికి చెందిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు విజయమ్మ, లక్ష్మిదేవి హాజరయ్యారు. 560 మంది లబ్దిదారులకు వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మంజునాథ్‌గౌడ్, ఆర్ఐ శ్యామలా దేవి, మున్సిపల్ ఆర్ఐ విక్రమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: 80బన్నూరు సచివాలయం పరిధిలో సర్పంచ్ శ్యామలమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తదితరులు హాజరయ్యారు. 90 మంది లబ్ధిదారులకు వలంటీర్ల చేతులమీదుగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిలేటిరెడ్డి(నానిరెడ్డి), రమేష్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో సచివాలయం వద్ద ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 60 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గం ప్రత్యేకాధికారి రఘురాం ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబయ్య, శివలింగం,రమణారెడ్డి, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సామాన్యులకు రక్ష

నందికొట్కూరు రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమం సామాన్య ప్రజలకు రక్షణగా నిలుస్తోందని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ చెవుల సుజాతతో కలిసి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీవో శోభారాణి, సింగిల్ విండో చైర్మన్ సగినేల వృశేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బతిరవి, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలపరిధిలోని నాగలూటి గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ ఉషారాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, నందికొట్కూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి హాజరై 594 మందికి వివిధ రకాల సర్టిఫికేట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జ్ రవికుమార్, నాగలూటి ఉపసర్పంచ్ యశోద, పైపాలెం గ్రామ సర్పంచ్ రామచంద్రుడు, ఉప సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో 450 మందికి ధ్రువపత్రాలు

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ సచివాలయం 1 వద్ద సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ వెంకటరమణ నిర్వహించారు. ఎంపీటీసీ చంద్రమోహన్ నాయుడు హాజరై 450 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్ వైఎస్సార్‌సీపీ నాయకులు పులేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు మేలు

కొత్తపల్లి:జగనన్న సురక్ష ప్రజలకు మేలు చేకురుస్తుందని ప్రత్యేకాధికారి రఘురామ్, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామ సచివాలయంలో సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైస్ ఎంపీపీ సింగారం వెంకటరమణ(రంగ), ఉప సర్పంచు కరిముల్ల, వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీష్ గౌడ్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నందికొట్కూరు/ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాస్కర్‌రెడ్డి కోరారు. గురువారం నందికొట్కూరుమున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళా కార్మికులు రవణమ్మ, రత్నమ్మ, చిట్టెమ్మ, పద్మమ్మ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆత్మకూరులో కార్మికులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. నాయకులు విజయ్, నాగేశ్వరరావు, చెన్నయ్య, రాంనాయక్, రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

రైతులే శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మహానంది: రైతులే తమ అనుభవాలను జోడించుకుంటూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని బండిఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి స్వాతి అన్నారు. ఈర్నపాడులో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతుల వైపు మొగ్గు చూపాలన్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గి ఆర్థికంగా మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేలాల ద్వారా దేవస్థానానికి భారీ ఆదాయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో ఓ హోటల్, డార్మెంటరీ వేలాల ద్వారా భారీ ఆదాయం చేకూరింది. గురువారం దేవస్థానం పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో మల్లికార్జున సదన్ వద్ద గల ఓ హోటల్ కి, డార్మెంటరీకి బహిరంగ వేలం నిర్వహించారు. డార్మెటరీకి ముగ్గురు పాట దారులు పోటీ పడగా వారిలో సత్యనారాయణరెడ్డి రూ.1.06 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే హోటల్‌కు ముగ్గురు పోటీ పడగా వెంకటేష్ గౌడ్ రూ.12.05 లక్షలకు వేలం దక్కించుకున్నారు. గతంలో డార్మెటరీ నెలసరి అద్దె రూ.50 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.56 వేలు అదనంగా దేవస్థానానికి లబ్ధి చేకూరింది. అలాగే హోటల్ రూ.2 లక్షలకు పైగా ఉండగా, ప్రస్తుతం రూ.12 లక్షల 15 వేలకు పెరిగింది. దీంతో దేవస్థానానికి భారీ ఆదాయం చేకూరినట్లైంది.

ఘాట్‌రోడ్డులో తెగిన విద్యుత్ తీగలు



రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ తీగ

మహానంది: గాజులపల్లె-గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో గురువారం విద్యుత్ తీగలు తెగిపడగా ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. రోడ్‌సేఫ్టీ పోలీసులు గుర్తించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు గాజులపల్లె మీదుగా వచ్చే మార్గంలో తెలుగుగంగ కట్ట వద్ద తీగలు తెగిపడ్డాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు తీగలను చూసి భయంతో ఆగిపోయారు. విషయాన్ని తెలుసుకున్న రోడ్‌సేఫ్టీ పోలీసులు పీరయ్య, మదనశేఖర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానిక ఉద్యోగి పీఎన్ఎస్ రాయుడు, లైన్‌మెన్ సుబ్రహ్మణ్యం తీగలను సరిచేశారు. దీంతో ఈ మార్గంలో పెద్ద ప్రమాదం తప్పగా వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.